ఊరు మాయమైంది!

పాలకులు.. అధికారులు తలచుకుంటే దెబ్బలకు కొదవా.. పారిశ్రామిక వేత్తలు తలచుకుంటే ఊర్లే గల్లంతవుతాయన్న చందంగా ఉంది ప్రస్తుత కాలం. అదే కోవకు చెందుతుంది ఒకప్పుడు రెండో వార్డు, ప్రస్తుతం 68వ వార్డు పరిధిలో ఉన్న చుక్కవానిపాలెం గ్రామ పరిస్థితి. ఓ పరిశ్రమ కోసం ఊరే మాయమైంది. అయితే ఓ నలుగురు మాత్రం పురిటిగడ్డ మీద మమకారంతో గ్రామంలోనే జీవిస్తున్నారు. తుది శ్వాస విడిచే వరకూ ఇక్కడే ఉంటామని స్పష్టం చేస్తున్నారు.



తుప్పల్లో శిథిలమైన నివాసాలు



గ్రామంలో శిథిలమైన రామాలయం

- అయినా పురిటిగడ్డపై మమకారం
- శిథిలాల మధ్యే నివసిస్తున్న నలుగురు
- తుది శ్వాస విడిచే వరకూ ఇక్కడే ఉంటామని స్పష్టీకరణ

అక్కిరెడ్డిపాలెం: ములగాడ, మింది గ్రామాల మధ్యలో చుక్కవానిపాలెం.. 35 ఎకరాల్లో 150కి పైగా కుటుంబాలతో గ్రామం కళకళలాడేది. ఊర్లో రామాలయం, ప్రాథమిక పాఠశాల, రచ్చబండలు, చిన్నచిన్న దుకాణాలతో ఎంతో సందడిగా ఉండేది. ప్రస్తుతం ఆ గ్రామ ఆనవాళ్లు కూడా లేవు. అయినా ఊరుతో ఉన్న మమకారంతో చుక్కా ఎల్లారెడ్డి (85), గంటా అప్పల నర్సమ్మ (60), నర్సాయమ్మ (40),పిలకా రమణమూర్తి (57) అక్కడే నివసిస్తున్నారు.



గ్రామం చుట్టూ డంప్ చేసిన కంటైనర్లు

గ్రామం కథా కమామిషు ఇది...

జింక్ పరిశ్రమను ఆనుకొని 35 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో చుక్కవానిపాలెం ఉండేది. జింక్ పరిశ్రమ నుంచి వచ్చే కాలుష్యం వల్ల గ్రామంలో ఉండే సుమారు 150 కుటుంబాల వారు తమ ఇబ్బందులను పాలకులు, పరిశ్రమ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లింది. దీంతో యాజమాన్యం చుక్కవానిపాలెంలో ప్రతీ కుటుంబానికి ఆటోనగర్‌లోని వడ్లపూడి రైల్వే క్యాబిన్ సమీపంలో కుటుంబానికి 100 గజాల విస్తీర్ణంలో గృహాల నిర్మించడానికి 2005లో శంకుస్థాపన చేసింది. 2007లో నిర్వాసితులకు ఇళ్ల అప్పగించారు. సుమారు 95 శాతం మంది గ్రామం విడిచి వెళ్లిపోయారు. గ్రామం తరలింపు తర్వాత కొంతకాలానికి జింక్ పరిశ్రమ మూతపడింది. ఇదే సమయంలో గ్రామాన్ని ఆనుకొని ఉన్న మరో వ్యాపార సంస్థ శ్రావణ్ షిప్పింగ్ కంపెనీ చుక్కవానిపాలెం పరిధిలోని 25 ఎకరాలకు పైగా పొలాలను కొని అందులో కెమికల్స్, ఇతర ప్రొడక్ట్స్‌కు చెందిన కంటైనర్ల డంపింగ్ చేపట్టారని అప్పటి గ్రామస్తులు చెబుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో సెంటు ధర రూ.3. 50 లక్షలు పలికే స్థలాన్ని కేవలం రూ.70 వేలు చొప్పున కొని గ్రామంలో ఇళ్లను నేలమట్టం చేసి కంటైనర్లు డంప్ చేయడానికి వినియోగిస్తున్నారని తెలిపారు.



శిథిలమైన నివాసాలు

శ్మశానాన్ని తలపిస్తోంది..

పచ్చగా పల్లె వాతారణాన్ని తలపించే గ్రామం ఇప్పుడు శ్మశాన వాతావరణాన్ని తలపిస్తూ దెయ్యాల దిబ్బంగా ఉంది. గ్రామంలో రామాలయం పాడుబడింది. సీతారామల లక్ష్మణులను పూజించేవారు లేరు. ప్రాథమిక పాఠశాల శిథిలమైంది. గ్రామం నలుమూలలా శ్రావణ్ షిప్పింగ్ కంటైనర్ల డంపింగ్, భారీ వాహనాల రాకపోకలతో దుమ్ముకొట్టుకుపోయింది. అయినా ఓ నలుగురు మాత్రం గ్రామాన్ని విడిచి పెట్టలేక అక్కడే జీవనం సాగిస్తున్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు చుట్టపు చూపుగా వచ్చి వీరిని పలకరించి వెళ్లిపోతారు.

ఇక్కడే చివరివరకు ఉంటా...



చుక్కవానిపాలెం గ్రామంతో నాకు తల్లిదండ్రులతో ఉన్న అనుబంధం లాంటిది. ఇక్కడే పుట్టాను. చివరి వరకు ఇక్కడే ఉంటాను. ప్రస్తుతం నా ఇంట్లో నేను కూతురు ఉంటున్నాం. విషకీటకాల ఇబ్బందులు ఎక్కువగా ఉన్నాయి. – చుక్కా ఎల్లారెడ్డి, చుక్కవానిపాలెం

ఎవరూ లేక పోయినా.. మనశ్శాంతిగా ..



ఊరు కన్నతల్లి లాంటిది. గ్రామంతో ఎంతో అనుబంధం ఉంది. ఊరు వదిలి వెళ్లను. ఏదైనా పనిమీద గ్రామం దాటి శ్రావణ్ షిప్పింగ్ కంటైనర్ల మధ్య నుంచి వెళ్లాలంటే ఇబ్బంది తప్పా.. ఇక ఏ ఇబ్బంది లేదు. తండ్రితో పాటు ఇంకో కుటుంబం ఉంది. – చుక్కా నర్సాయమ్మ, చుక్కవానిపాలెం

గ్రామాన్ని వదిలి ఉండలేక..



చుక్కవానిపాలెంలోనే పుట్టాను. గ్రామంతో చాలా అనుబంధం ఉంది. నా మేనమామను చూసుకోవడానికి వారానికి ఒక్క సారైనా వస్తాను. కొంత సమయం వాళ్లతో గడిపిన తర్వాత మనశ్శాంతిగా ఉంటుంది. ఊరు మాయమైంది. ఆ బాధ చెప్పలేనిది. – పిలకా రమణమూర్తి, చుక్కవానిపాలెం నిర్వాసిత కాలనీ

పుట్టిన ఊరిలో ఆనందంగా..



నేను నా తమ్ముడు ఉంటున్నాం. ఊరు నా కళ్లముందే మాయమైంది. చుట్టూ శిథిలమైన ఇళ్లు, రోడ్లు మాయం తలుచుకుంటే ఎంతో బాధగా ఉంటుంది. అయినా పుట్టిన గడ్డపై ఉండడంలో ఉన్న ఆనందం చెప్పలేను. – గంటా అప్పల నర్సమ్మ, చుక్కవానిపాలెం

క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాజువాక: కర్ణవానిపాలెం విద్యుత్ సబ్ స్టేషన్‌లోని సుందరయ్య కాలనీ ఫీడర్‌కు శుక్రవారం మెయింటెనెన్స్ పనులు నిర్వహించనున్నట్టు ఈపీడీసీఎల్ జోన్–2 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.కె.నాయుడు తెలిపారు. ఈ కారణంగా సుందరయ్య కాలనీ, అఫీషియల్ కాలనీలోని రోడ్ నంబర్ 3 నుంచి 6 వరకు, శ్రీనగర్ దిబ్బపాలెం కాలనీ, కృష్ణదేవరాయనగర్‌లలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

జీతాలు చెల్లించాలని ధర్నా



ధర్నాలో మాట్లాడుతున్న మంత్రి రాజశేఖర్

పెదగంట్యాడ: నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఉక్కు ఉద్యోగుల జీతాలను వెంటనే చెల్లించాలని ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇంటక్ ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ గొందేశి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు వద్ద బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని కోరారు. ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయవద్దని, ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలన్నారు. నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీవీ రమణమూర్తి, బీఎన్ రాజు, కారు రమణ, గొందేశి మహేశ్వరరెడ్డి, మంత్రి గోపీ నారాయణ, పోలీస్ నాయుడు పాల్గొన్నారు.

జొన్నకూటి ఫౌండేషన్ ఏర్పాటు

అగనంపూడి: డాక్టర్ జొన్నకూటి ఫౌండేషన్‌ను బుధవారం నూతనంగా ఏర్పాటు చేశారు. వడ్లపూడి తిరుమలనగర్‌లో ఫౌండేషన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా డాక్టర్ జొన్నకూటి విజయ్‌కుమార్, అధ్యక్షుడిగా తోట గోవిందరావు, ఉపాధ్యక్షుడిగా జొన్నకూటి వెంకటరావు, కార్యదర్శిగా జొన్నకూటి కుమారి, సంయుక్త కార్యదర్శిగా చెప్పెల్ల తేజశివ, కోశాధికారిగా అవినాష్, ట్రస్టీగా విజయ్‌కుమార్‌లను ఎన్నుకున్నారు.

1 నుంచి పెరిగిన రిజిస్ట్రేషన్ చార్జీల అమలు

అక్కిరెడ్డిపాలెం: పెరిగిన భూములు, నిర్మాణాల రిజిస్ట్రేషన్ చార్జీలు ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి అమల్లోకి వస్తాయని గాజువాక జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు పేర్కొన్నారు. గాజువాక, నరవ, జగ్గరాజుపేట, కణితి, ములగాడ గ్రామాల్లో మార్కెట్ విలువలు సవరించినట్టు తెలిపారు.గాజువాక ఎస్‌ఆర్‌యూ పరిధిలోని కూర్మన్నపాలెం, మింది, అక్కిరెడ్డిపాలెం, మల్కాపురం, గుల్లలపాలెం గ్రామాల పరిధిలో లే అవుట్లు, అపార్ట్‌మెంట్‌ల మార్కెట్ విలువలు పెంచలేదన్నారు. ఈ గ్రామాల పరిధిలో 2023 జూన్‌లో జరిగిన రివిజన్‌లో పెంచడం వల్ల ప్రస్తుతం యధాతథంగా ఉంచినట్టు తెలిపారు.

లారీ ఢీ కొని మహిళ మృతి

అక్కిరెడ్డిపాలెం: సైకిల్‌పై వెళ్తున్న మహిళను లారీ ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. బుధవారం జరిగిన ప్రమాదంపై దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 69వ వార్డు తుంగ్లాంలో ముగ్గురు సంతానంతో కింతాడ దేవి (దేవుడమ్మ) (35) నివాసం ఉంటుంది. భర్త వదిలేయడంతో ఇంటి నిర్మాణ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తోంది. బుధవారం వడ్లపూడిలో కూలి పనులు ముగించుకుని సైకిల్‌పై తుంగ్లాంలో తన నివాసానికి వస్తుంది. సాయంత్రం 7 గంటల సమయంలో వెనుక నుంచి ఆమెను లారీ వేగంగా ఢీ కొట్టింది. ప్రమాదంలో దేవి తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందింది. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

యువకుడి అదృశ్యం



వంగలపూడి త్రిమూర్తులు

పెదగంట్యాడ: మండలంలోని నెల్లిముక్కుకు చెందిన యువకుడు అదృశ్యమయ్యాడు. న్యూపోర్టు పోలీస్‌స్టేషన్ సీఐ కామేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం..నెల్లిముక్కులో వంగలపూడి త్రిమూర్తులు (33) తల్లితో కలసి నివాసం ఉంటున్నాడు. 15 రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లిన అతను తిరిగి రాలేదు. దీంతో అతని తల్లి స్నేహితులు, బంధువులను ఆరా తీశారు. ఫలితం లేకపోవడంతో బుధవారం న్యూపోర్టు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. న్యూపోర్టు సీఐ కామేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో రథయాత్ర ప్రారంభం



రథయాత్రలో పాల్గొన్న కార్పొరేటర్ స్టాలిన్ తదితరులు

గాజువాక: ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం వుడా కాలనీ శాఖ ఆధ్వర్యంలో సోమనాథేశ్వర వజ్రలింగ రథయాత్ర బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ యాత్రను 72వ వార్డు కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో నైతిక విలువలు పడిపోయాయని, అశాంతి నెలకొందని అన్నారు. ప్రజల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు బ్రహ్మ కుమారీ సంస్థ సభ్యులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ పి.హేమలత, డాక్టర్ పంకజ్, న్యాయవాది అండిబోయిన లక్ష్మి, రథ నిర్వాహకులు సుభాష్, మణి, శాంతి, శ్రీనివాసరావు, నందికి తాతారావు, స్థానిక నాయకులు అప్పారి విష్ణుమూర్తి, జి.ఆనంద్ పాల్గొన్నారు.

అగ్ని మాపక కేంద్రం ఆధునికీకరణ పనుల ప్రారంభం



అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్న అగ్నిమాపక దళ అధికారులు

పెదగంట్యాడ: స్థానిక అగ్ని మాపక కేంద్రాన్ని ఆధునికీకరించి అదనపు వసతులు కల్పించనున్నట్టు కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ జ్ఞాన సుందరం తెలిపారు. సీఎస్సార్ నిధులతో భవనానికి రంగులు వేయనున్నామని, అలాగే షెడ్డు నిర్మాణం, గ్లోసైన్ బోర్డు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ మేరకు అగ్ని మాపక కేంద్రంలో చేపట్టనున్న పనులకు ప్రాంతీయ అగ్ని మాపక దళ అధికారి నిరంజన్‌రెడ్డి, జిల్లా అగ్ని మాపక దళ అధికారి ఎస్.రేణుకయ్యతో కలసి బుధవారం శ్రీకారం చుట్టారు. ఇంకా అవసరమైన సదుపాయాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కోరమాండల్ ప్రతినిధులు వెంకటరమణ, నాగరాజు, లోకేష్, సహాయ అగ్నిమాపక దళ అధికారులు గోపీ కృష్ణ, సింహాచలం, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రత.. అందరి బాధ్యత

ఎంవీ ఇన్‌స్పెక్టర్ బుచ్చిరాజు



అగనంపూడి: రోడ్డు భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, వాహనచోదకులపై కూడా ఉందని సీనియర్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బుచ్చిరాజు అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలు పాటించడం, హెల్మెట్ ధరించడం, పరిమిత వేగంతో ప్రయాణించడం వాహనచోదకుల బాధ్యత అన్నారు. ట్రాఫిక్ నియంత్రణపై మాత్రమే పోలీసులు దృష్టి సారించగలరన్నారు. అదుపుతప్పిన వేగం, హెల్మెట్ ధరించకుండా, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపడమే ప్రమాదాలకుఎక్కువగా కారణం అవుతున్నాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు, కోఆర్డినేటర్ పిన్నింటి సన్యాసిరావు, డీన్ బి.సతీష్ పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వో ఆకస్మిక సందర్శన



అక్కిరెడ్డిపాలెంలో సిబ్బంది నుంచి వివరాలు సేకరిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

అక్కిరెడ్డిపాలెం: జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి పి.జగదీశ్వరరావు బుధవారం అక్కిరెడ్డిపాలెం ఆరోగ్య కేంద్రం పరిధిలోని అక్కిరెడ్డిపాలెం , నాతయ్యపాలెం సచివాలయంతో పాటు ములగాడ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల గురించి సమీక్ష నిర్వహించారు. దీనిలో భాగంగా ఎంఆర్ – 1, ఎంఆర్ – 2 బ్యాక్లాగ్స్ గురించి, ఓపీ, ఐపీ సేవలు, ఆర్‌కేఎస్ మొదలైన కార్యక్రమాలపై మెడికల్ అధికారులకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ముఖ హాజరు విధిగా వేయాలని, సమయ పాలన పాటించాలని సూచించారు. అభ ఐడీ మ్యాపింగ్ శతశాతం సాధించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్రం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేటరింగ్ వ్యాపారిని ఖాళీ చేయించారు

సాక్షి ఎఫెక్ట్..



ప్రసన్నగిరిపై కేటరింగ్ వ్యాపారం చేస్తున్న గదికి తాళాలు వేస్తున్న ఆలయ సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం: భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల దేవదాయ ధర్మదాయ శాఖకు చెందిన ప్రసన్న గిరిపై అనుమతులు లేకుండా కొద్ది నెలలుగా కేటరింగ్ వ్యాపారం చేసుకుంటున్న వ్యక్తిపై ఆలయ పరిపాలన అధికారి చర్యలు తీసుకున్నారు. ఆలయ భవనాల్లో కేటరింగ్ వ్యాపారం అనే శీర్షికతో బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. ఆలయ సిబ్బందితో కేటరింగ్ సామగ్రి ఆలయ పరిసరాల నుంచి తొలగించి గదులకు తాళాలు వేయించారు.

సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న రెవెన్యూ సిబ్బంది, నాయకులు

అగనంపూడి: అగనంపూడి పునరావాస కాలనీల్లో విద్యుత్ డిమాండ్‌కు సరిపడా సరఫరా కాకపోవడంతో విద్యుత్ సరఫరాలో హెచ్చు తగ్గులు వస్తున్నాయి. సమస్యను స్థానికులు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఈపీడీసీఎల్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు దొంకాడలో ఉన్న స్థలాన్ని పరిశీలించారు. సుమారు 30వేల జనాభా ఉన్న పునరావాస కాలనీల్లో విద్యుత్ వినియోగం రెట్టింపు అయినప్పటికీ సరిపడా విద్యుత్ సరఫరా జరగడం లేదని, ఇండోర్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలనే అధికారుల ప్రతిపాదన మేరకు దొంకాడలో స్థల పరిశీలన చేశారు.

పగిలిన తాగునీటి పైప్‌లైన్

భారీగా పోయిన మంచినీరు



వుడా కాలనీ మెయిన్ రోడ్‌లో పగిలిన పైప్‌లైన్



రోడ్డుపై వృథాగా పోతున్న తాగునీరు

గాజువాక: స్థానిక వుడా కాలనీ మెయిన్ రోడ్‌లో నీటి సరఫరా ప్రధాన పైప్‌లైన్ పగిలిపోయింది. 200 ఎంఎం డయాగల పైప్‌లైన్ ఒక్కసారిగా పగలడంతో నీరు భారీగా రోడ్డుపై పారింది. సుమారు రెండు గంటలపాటు నీరు పారడంతో రోడ్డు చెరువును తలపించింది. ఈ విషయంపై స్థానికులు జీవీఎంసీ నీటి సరఫరా విభాగం అధికారులకు సమాచారం ఇచ్చారు. ప్రధాన పైప్‌లైన్ కావడంతో నీరు రోడ్డుపైకి పారకుండా నియంత్రించడానికి కొంత సమయం పట్టిందని జీవీఎంసీ నీటి సరఫరా విభాగం సిబ్బంది తెలిపారు. కాగా, ఇటీవల కాలంలో పైప్‌లైన్లు పగిలిపోవడం, లీకేజీలు ఎక్కువైపోయాయని దీనిపై అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికే అరకొరగా నీటి సరఫరా సాగుతున్న నేపథ్యంలో ఇలాంటి సంఘటనల వల్ల ప్రజలు తాగునీటికి మరింత ఇబ్బంది పడాల్సి వస్తోందని పేర్కొంటున్నారు.

30 మందికి క్యాంపస్ కొలువులు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రామారావు

గాజువాక: స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది.15 కంపెనీల్లో నియామకాలకు ఆశ్రయ జిల్లా వికలాంగుల సమాఖ్య, చేషర్ డిజేబుల్డ్ ట్రస్టు సంయుక్తంగా నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 150 మంది అభ్యర్థులు పాల్గొన్నారని, 30 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారని కళాశాల ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ తెలిపారు. దివ్యాంగులకు, నిరుద్యోగ యువతీ యువకులకు ఇలాంటి అవకాశం కల్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నిర్వాహకుడు సుకుమార్, కళాశాల అధ్యాపకులు ఎస్.వి.కృష్ణ, వై.ఈశ్వర రాజు, వి.తేజేశ్వరరావు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కామేశ్వరరావు పాల్గొన్నారు.

650 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు, చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

అగనంపూడి: మమతా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 85వ వార్డు అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచితంగా రక్త పరీక్షలు (బ్లడ్ గ్రూపింగ్) నిర్వహించారు. 650 మంది విద్యార్థులకు రక్త పరీక్షలతో పాటు నేత్ర పరీక్షలు చేశారు. విశాఖ నేత్ర వైద్యశాల చారిటబుల్ ట్రస్ట్ సహకారం అందించింది. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కృష్ణారావు, మమతా చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు, విశాఖ ఐ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు జాతి ఆకాంక్షలపై విధ్వంసం ఆపాలి

అగనంపూడి: తెలుగు జాతి ఆశలు, ఆకాంక్షలపై కేంద్ర ప్రభుత్వం విధ్వంసకరమైన చర్యలకు ఒడిగడుతుందని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, పరంధామయ్య ఆరోపించారు. ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన 1448వ రోజు రిలేదీక్షా శిబిరంలో వారు మాట్లాడారు.

ఉక్కు మంత్రిత్వ కార్యదర్శి, కేంద్ర ఉక్కు శాఖ మంత్రి విశాఖ ఉక్కు సందర్శనలో భవిష్యత్ కార్యాచరణ పేరుతో చర్చలు జరుపుతామని చెప్పడం ఓ నాటకంలా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగేళ్ల నుంచి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉక్కు పరిరక్షణలో ఎవరి ఆట వాళ్లు ఆడుతున్నారని, మధ్యలో తెలుగు ప్రజలను నమ్మించి మోసం చేస్తున్నారని ఆరోపించారు. దీక్షా శిబిరంలో జేఎంఎస్, యూజ్, వీఎస్ఎంఎస్, వీఎస్ఈయూ సంఘాల నాయకులు కూర్చొన్నారు. కార్యక్రమంలో వరసాల శ్రీనివాసరావు, దాసరి శ్రీనివాస్, డేవిడ్, జీఆర్‌కె నాయుడు, టి.జగదీష్, కామేశ్వరరావు పాల్గొన్నారు.

నీటి లీకేజీలతో రహదారి ధ్వంసం

శాతవాహన నగర్‌లో పైప్‌లైన్ లీకేజీలు



శాతవాహన నగర్ రోడ్డు-1లో వృథాగా పారుతున్న నీరు

అగనంపూడి: నీటి లీకేజీలతో కూర్మన్నపాలెం శాతవాహన నగర్ రహదారి ధ్వంసమైంది. రోడ్డు నంబర్ 1లో రెండు చోట్ల రెండు నెలల నుంచి పైప్‌లైన్ పగిలిపోవడంతో నీరు వృథాగా పారుతోంది. మరమ్మతులు చేపట్టకపోవడంతో నీటి ప్రవాహానికి తోడు వాహనాల రాకపోకలతో రోడ్డు శిథిలమైంది. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు మండిపడుతున్నారు. అలాగే డ్రైనేజీల్లో పూడిక తీయకపోవడంతో మురునీటి కాల్వలు నిండిపోయి దుర్వాసన వస్తోందని కాలనీ ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి వెంటనే తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.